ప్రజాశక్తి

సోమవారం 5 జనవరి 2026 5 అనంతపురం





సదస్సులో మాట్లాడుతున్న సి. రామచంద్రయ్య

అంపశయ్యపై 'అనంత' కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అంపశయ్యపై కాలం వెల్లదీస్తోంది. పాలక, ప్రతిపక్ష నాయకుల ఆధిపత్యంతో సతమతమవుతోంది. ఏ నాయకుడి మాట వింటే ఏం ఆపద ముంచుకొస్తుందోనని కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి ఆరోపణలతో ఇప్పటికే పలువురు అధికారులు సెలవులపై వెళ్లారు. మరికొందరు బదిలీ అయ్యారు. నాయకుల ఆధిపత్య పోరుతో, అధికారుల సెలవులతో కార్పొరేషన్‌లో పనులు ముందుకు సాగడం లేదు. సర్వేలు, టార్గెట్లు పూర్తికాక లక్షలాది రూపాయల నిధులు మంజూరు కావటం లేదు. ఇలాంటి పలు కారణాలతో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కుంటుపడింది.

- పాలక, ప్రతిపక్ష నాయకుల ఆధిపత్యపోరు
- విధులు నిర్వర్తించడానికే భయపడుతున్న అధికారులు
- సెలవుల బాటలో ప్రధాన శాఖల అధికారులు
- పురపాలిక అభివృద్ధికి గండి

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలకసంస్థలో పాలక పార్టీ వైసిపి. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది, స్థానిక ఎమ్మెల్యే టిడిపి. ఈ నేపథ్యంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ రెండు పార్టీల మధ్య ఆధిపత్యపోరు సాగుతోంది. కార్పొరేషన్‌లో పాలకపక్షమైన తమను కాదని, తమ అనుమతి లేకుండా పనులు జరుగుతున్నాయని వైసిపికి చెందిన మేయర్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు విమర్శలకు దిగుతున్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో అధికారంలో ఉన్న తమను కాదని వ్యవహరిస్తున్నారని టిడిపి వారు ప్రతి విమర్శలకు దిగుతున్నారు. ప్రధాన పార్టీల నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు కారణంగా మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి నోచుకోవటం లేదన్న విమర్శలు బలంగా వినపడుతున్నాయి. ఇదిలా ఉండగా ఏపార్టీ నాయకుడి మాట వింటే ఏం ఆపద ముంచుకొస్తుందోనని కార్పొరేషన్‌లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. వీరి మధ్య నెలకొన్న ఆధిపత్యపోరుకు బలైన అధికారులు కూడా ఉన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెవెన్యూ విభాగంలో రెవెన్యూ ఆఫీసర్ గా పని చేస్తున్న విజయ్ కుమార్ డిసెంబర్ నెలలో నెల రోజుల సెలవుపై వెళ్లారు. శారదా నగర్‌లో ఓ నివాసగృహం టాక్స్‌ను ఫేక్ డాక్యుమెంట్స్‌తో వచ్చిన వారి పేరు మీద మార్చడంతో ఆయనపై వివాదం చెలరేగింది. ఈ వివాదంపై పాలకవర్గం సభ్యులు కలెక్టర్‌ను కలిసి ప్రజావేదికలో ఫిర్యాదు చేయడంతో దీనిపై విచారణ కొనసాగుతోంది. ఈ అవినీతి బాగోతం బహిర్గతం కావడంతో ఆర్‌వో విజయ్ కుమార్ డిసెంబర్ నెలలో నెల రోజుల సెలవు పై వెళ్లాల్సి వచ్చింది. వాస్తవంగా ఆయన జనవరి ఒకటవ తేదీన విధులకు హాజరుకావాల్సుంది. అయితే ఈ అవినీతి బాగోతం పై విచారణ కొనసాగుతుండటంతో తిరిగి మరో నెల రోజులపాటు సెలవు పొడిగించడంతో ఆయన విధులలో చేరటం ఇప్పట్లో జరగదన్న విషయం స్పష్టమైంది. అర్బన్ ప్రజాప్రతినిధి అనుచర గణం కనుసన్నలలోనే కార్పొరేషన్ అధికార యంత్రాంగం పనిచేస్తుందన్న పాలకవర్గం ఆరోపణలకు ఈ అంశం బలం చేకూరిందనిఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో 14 మందికి పైగా సిబ్బంది పనిచేయాల్సిన చోట ఒకే ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. నక్ష సర్వే విషయంలో అప్పటి ఏసిపి శిరీష నిర్లక్ష్యమైన నిర్వాకంతో సచివాలయం ప్లానర్స్ తిరుగుబాటు చేశారు. దీనితో నక్ష సర్వే ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. వారం రోజుల వ్యవధిలో సర్వే పూర్తిచేసి ఆమోదముద్ర పొందితే కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 20 కోట్ల రూపాయల ఇన్సెంటివ్ అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు మంజూరయ్యే అవకాశం లేదు. ఇదిలా ఉండగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ నీరజాక్ష డిసెంబర్ 31 వరకు సెలవు పై వెళ్లింది. అయితే ఇప్పటివరకు డ్యూటీలో జాయిన్ కాలేదు. పాలకవర్గ సభ్యుడి బెదిరింపులకు జడిసి ఏసిపి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. బెదిరింపులు, ఒత్తిళ్ల నడుమ అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో విధులు నిర్వహించటం కన్నా బదిలీ చేయించుకుని వెళ్లడం మంచిదన్న అభిప్రాయంలో ఏసీపి ఉన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఏసీపి నీరజాక్షి మరో మారు సెలవు పొడిగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇదే గనక వాస్తవమైతే టౌన్ ప్లానింగ్ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్య ప్రజా ప్రతినిధికే దక్కుతుందన్న అభిప్రాయాలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ ప్లాన్లు ఫీజుల ద్వారా రావలసిన రాబడికి భారీగా గండి పడే ప్రమాదం ఉంది.అలాగే బిల్డింగ్ ఫినాలైజేషన్ స్కీం ద్వారా మున్సిపల్ కార్పొరేషన్‌కు సమకూరాల్సిన కోట్లాది రూపాయల నిధులకు కూడా గండిపడే ప్రమాదం ఉంది. ముఖ్య ప్రజా ప్రతినిధి అనుచర వర్గం చెప్పినట్లుగా నడుచుకోవడం వల్లనే రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్న రెవెన్యూ ఆఫీసర్ విజయ్ కుమార్ ఎన్నడూ లేని విధంగా ఫేక్ డాక్యుమెంట్స్ ఆధారంగా టాక్స్ మార్చటంతో వివాదంలో కూరుకు పోయారన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. ఈ అంశంపై విచారణ జరగనున్న నేపథ్యంలో ఇందుకు బాధ్యులైన డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్, ఆర్ఐలు ఎలాంటి క్రమశిక్షణ చర్యలకు గురికావాల్సి వస్తుందోనన్న భయంతోనే ఒకరు బదిలీ చేయించుకోవడం, మరొకరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం లాంటివి చోటు చేసుకున్నాయని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ అంశంపై విచారణ జరపాల్సిందిగా ప్రజా వేదికలో పాలకవర్గ సభ్యులు మేయర్ సమర్పించిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆనంద్ పిజిఆర్ఎస్ ద్వారా కమిషనర్ కు లేఖ పంపినట్లు సమాచారం.



అనంతపురం నగరపాలకసంస్థ కార్యాలయం

ఖాళీగాఉన్న హెల్త్ ఆఫీసర్ పోస్టు : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు కీలకమైన ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో డిఇబిఎల్ నరసింహ తర్వాత డిప్యూటీ కమిషనర్ పావని హెల్త్ ఆఫీసర్‌గా వ్యవహరించారు అలాగే రెవెన్యూ విభాగం ఇన్‌ఛార్జిగానూ వ్యవహరించారు హెల్త్ ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న పావని పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అంజన్నకు ఇప్పటివరకు హెల్త్ ఆఫీసర్‌గా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించలేదు. దీంతో కీలకమైన హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది హెల్త్ ఆఫీసర్‌గా కీలకమైన పారిశుధ్య పనులు, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు జనన మరణ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. ఈపోస్టు ఖాళీగాఉండటంతో పారిశుధ్య పనుల పర్యవేక్షణతో పాటు జనన మరణ సర్టిఫికెట్ల జారీకి సైతం ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఏడాదికాలంగా హెల్త్ ఆఫీసర్ పోస్టుకు సంబంధించి రెగ్యులర్ అధికారి నియామకం జరకపోవడంతో ఇన్‌ఛార్జీలా పాలనే కొనసాగుతోంది. ఇటీవల కాలంలో పారిశుధ్య వాహనాలకు సంబంధించి డీజిల్ సరఫరాను సైతం పోలీసు శాఖకు సంబంధించిన పెట్రోల్ పంపు నిర్వాహకులు నిలిపివేశారు దీనితో పారిశుధ్య వాహనాలకు డీజిల్ వేయించటంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు ప్రజారోగ్య విభాగ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. దీనితో ప్రధాన రహదారుల్లోని కీలకమైన కూడళ్లలో చెత్త తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో కీలకమైన హెల్త్ ఆఫీసర్ పోస్టు బాధ్యతలను గతంలో లాగా డిప్యూటీ కమిషనర్‌కు అప్పగిస్తారా లేక రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేక శానిటరీ సూపర్‌వైజర్‌కు బాధ్యతలు అప్పగిస్తారా అన్నది తేలాల్సుంది.

కార్పొరేట్లకు దోచిపెట్టడమే అభివృద్ధా.. ?

రిటైర్డ్ ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేదల నుంచి వేలాది ఎకరాల భూములను లాగేసుకుని కార్పొరేట్లకు అప్పనంగా దోచిపెట్టడమే అభివృద్ధా అని రిటైర్డు ప్రొఫెసరు సి.రామచంద్రయ్య ప్రశ్నించారు. 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి నమూనా' అన్న అంశంపై మానవ హక్కుల వేదిక, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వికేంద్రీకరణ చర్చావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక గ్రంథాలయంలోని సమావేశం హాలులో సదస్సు జరిగింది. మానవ హక్కుల వేదిక నాయకులు అబ్దుల్ రసూల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మళ్లీ అదే తప్పు జరుగుతోందని విచారం వ్యక్తం చేశారు. గతంలో అభివృద్ధి అంతా హైద్రాబాద్ చుట్టూ కేంద్రీకరించబడిందని గుర్తు చేశారు. విభజన అనంతరం కొత్త రాష్ట్రం ఏర్పాటు తరువాత అయినా పాలకులు కళ్లు తెరచి అభివృద్ధిని వికేంద్రీకరిస్తారని భావించామని చెప్పారు. కాని ఇప్పుడు అభివృద్ధి అంతా అమరావతి పేరుతో దాని చుట్టే తిరుగుతోందన్నారు. పరి పాలనా రాజధానికి 2500 ఎకరాల్లోపు సరిపోతుందన్నారు. కాని ఇక్కడ ఏకంగా 55 వేల ఎకరాలను రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ పేరుతో తీసుకుంటున్నారన్నారు. ఇంత పెద్దఎత్తున సేకరిస్తున్న దానిలో ఐదు వేల ఎకరాల్లో విమానాశ్రయం, 1500 ఎకరాల్లో రైల్వే స్టేషన్ వంటివి ఉండటం చూస్తే విస్మయం కలుగుతుందన్నారు. ఇప్పటికే విజయవాడ పక్కన గన్నవరంలోనున్న విమానాశ్రయానికే పూర్తి స్థాయిలో ట్రాఫిక్ లేదని చెప్పారు. విశాఖలోనూ మరో 2500 ఎకరాల్లో కొత్త విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నారని ఇలా వేల ఎకరాల భూములను విమానాశ్రయం పేరుతో భూములను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అమరాతి రాజధాని ప్రాంతమని సేకరించిన వేల ఎకరాలైనా అనువైన ప్రాంతమా అంటే అదీ లేదని అన్నారు. అధిక వర్షాలు పడితే వరదలొచ్చే అవకాశవముందని ఇటీవల కురిసిన వర్షాలు స్పష్టం చేశాయన్నారు. దీన్ని నివారించేందుకు ఆరు చెరువులు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. రాజధాని నిర్మాణం కోసమని రూ.65 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తీసుకుందన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రజలపై పడే అదనపు భారమని వివరించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరముందని సూచించారు. ముఖ్యమైన నగరాల అభివృద్ధికి ఏడాదికి రూ.500 కోట్లు , చిన్న నగరాల అభివృద్ధికి ఏడాదికి రూ.100 కోట్ల చొప్పున కేటాయించి మౌళిక సదుపాయలు అన్ని చోట్ల పెంచడం ద్వారా సమగ్రమైన అభివృద్ధి జరిగేందుకు వీలుండేదని చెప్పారు. కాని ప్రభుత్వాలు ఇలా చేయడం లేదన్నారు. వివిధ పేర్లతో రైతుల నుంచి వేలాది ఎకరాలను తీసుకోవడం, అభివృద్ధి పేరుతో వాటికి కేటాయించడం జరుగుతోందని విమర్శించారు. అంతటితోనే ఆగకుండా వారికి పెట్టుబడికి కూడా నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వాలు సిద్ధమవుతుండటం మరింత శోచనీయమన్నారు. విశాఖలో వస్తున్న గూగుల్‌కు పెట్టుబడుల తోడ్పాటుకు కూడా సహకారం అందిస్తామని చెబుతుండటం గమనార్హమన్నారు. రాజధాని ప్రాంతంలో స్టార్ హోటల్ నిర్మించినా ఇటువంటి సహాయం అందిస్తామని చెబుతున్నారని ఇది సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు సుబ్బన్న, అభివృద్ధి వికేంద్రీకరణ నాయకులు సలీం తదితరులు పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన ప్రముఖులు

చట్టాన్ని ధిక్కరిస్తే తీవ్ర పరిణామాలు

వైసిపి నాయకులకు ఎమ్మెల్యే కాలవ హెచ్చరిక

ప్రజాశక్తి - రాయదుర్గం

ప్రశాంతతకు ఎవరు భంగం కలిగించినా, చట్టాన్ని ధిక్కరించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని స్థానిక వైసిపి నాయకులను రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. బొమ్మనహాళ్ మండల ఎంపీపీ ఎన్నిక విషయంలో తనపై వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ,మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి చేసిన ఆరోపణలపై కాలవ స్పందించారు. రాయదుర్గం పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలవ శ్రీనివాసులు మాట్లాడారు. బొమ్మనహాళ్ ఎంపీపీ రాజీనామా చేయడం వల్ల కొత్త ఎంపీపీ ఎన్నిక అనివార్యమైందన్నారు. ఎమ్మెల్యేగా సమావేశంలో పాల్గొనే అవకాశం తనకున్నా బొమ్మనహాళ్ మండలానికి తాను వెళ్లలేదన్నారు. అయితే తానుకనేకల్లు మండలానికి చెందిన గరుడచేడు రాజగోపాల్ రెడ్డి, నాగిరెడ్డి తదితర 50మందిని వెంటేసుకువెళ్లి అధికారులను తాను బెదిరించానని మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆరోపించడంలో నిజం లేదన్నారు. వైసిపి వారు గొడవ చేస్తున్నారని తెలిసిన కొందరు స్థానిక టిడిపి వారు అక్కడికి వెళ్లారన్నారు. వారిని కూడా వైసిపి వారు అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. ఆరు నెలల్లో ముగియనున్న ఎంపీపీ గడువు విషయంలో తాను జోక్యం చేసుకోలేదన్నారు. అలాగే ఇదివరలో జరిగిన కనేకల్లు ఎంపీపీ విషయంలోనూ తాను కల్పించుకోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుకోవడానికి రేయింబవళ్లు కష్టపడుతున్నానన్నారు. ప్రభుత్వం నుంచి వివిధ మార్గాల్లో నిధులు సమకూర్చుకొనే ప్రయత్నంలో ఉన్నానని చెప్పారు. తనపై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుంటే అనవసర విషయాల్లో తనను తప్పు పట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిజంగా ఏదైనా అన్యాయం జరిగి ఉంటే సంబంధిత పోలీసు అధికారులకు తగిన వివరాలతో ఫిర్యాదు చేయవచ్చన్నారు. చట్టబద్ధంగా వారు అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. అంతే తప్ప అనవసరమైన విషయాలలో తనను బాధ్యుడిని చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నాలు చేయడం విరమించుకోవాలన్నారు. చట్టాన్ని ధిక్కరించే ప్రయత్నం చేస్తే వారు ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బండి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, మునిసిపల్ వార్డు సభ్యులు జ్యోతి, ప్రశాంతి, పార్టీ నాయకులు భారతి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఇన్‌ఛార్జి అడిషనల్ ఎస్పీని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 5న రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలంలో ఎంపిపి స్థానానికి నిర్వహించనున్న ఎన్నిక సజావుగా జరిగేలా చూడాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామి రెడ్డి, సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, తలారి రంగయ్య, వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపి మాధవ్ కోరారు. ఈమేరకు ఆదివారం అనంతపురంలోని కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎస్పీ శ్రీనివాసరావును కలిసి విన్నవించారు. ఇందులో భాగంగా అక్కడ అధికార పార్టీ నేతలు వ్యవహరించిన తీరును వివరించారు. డీఎస్పీ, సీఐ సమక్షంలోనే వైసీపీ నేతలపై దాడికి దిగారని వివరించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఎన్నిక జరిగినా అప్రజాస్వామిక పద్ధతిలో ముందుకెళ్తున్నారని తెలిపారు. బొమ్మనహాల్ మండలంలో కూడా ఎంపిపి స్థానానికి ఎన్నిక ఉంంటే బీఫారం ఇవ్వడానికి తమ పార్టీ నేతలు వెళ్తే టీడీపీ గూండాలు భౌతికదాడికి దిగారని ఆరోపించారు. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి, కదిరి నియోజకవర్గంలో ఎంపీపీ ఎన్నికలు, కళ్యాణదుర్గం మునిసిపాలిటీల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వివరించారు. కనీసం బొమ్మనహాల్ ఎంపిపి ఎన్నిక అయినా ప్రజాస్వామ్యబద్దంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఎఎస్పీతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా నాయకులు

సకాలంలో బిల్లుల చెల్లింపులే లక్ష్యం



ఉద్యోగుల సమన్వయంతో పటిష్టంగా ట్రెజరీ సేవలు

జిల్లా ఖజానా శాఖ డిడి జి.రమణయ్య

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఉద్యోగులకు నెలసరి వేతనం, పెన్షనర్‌లకు పెన్షన్ ఎంతో ముఖ్యం. వారి కష్టార్జితాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టే చర్యల్లో భాగంగా సకాలంలో చెల్లింపులు జరపడమే లక్ష్యంగా జిల్లా ఖజానా శాఖ పని చేస్తోందని అనంతపురం జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణయ్య పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన ఖజానా శాఖ ద్వారా అందుతున్న సేవలపై ప్రజాశక్తి ముఖాముఖితో పంచుకున్నారు.

ప్రశ్న :ఖజానా శాఖ ద్వారా అందుతున్న సేవలు ఏమిటి ?

డిడి రమణయ్య : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్‌లు ఇతర పేమెంట్ అథారిటీగా ఖజానా శాఖ ద్వారా సేవలు అందుతాయి. ఆయా శాఖల నుంచి బిల్స్ డ్రాయింగ్ ఆఫీసర్లు, పెన్షన్ అథారిటీల నుంచి బిల్లులు జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీలకు వస్తాయి. జిల్లా ట్రెజరీలో అడ్మినిస్ట్రేసన్ పెన్షన్ పార్వడింగ్ మాత్రమే ఉంటుంది. పెన్షన్‌లు, డిస్పెన్స్ అథారిటీ సబ్ ట్రెజరీలో జరుగుతాయి.

ప్రశ్న బిల్లులు సకాలంలో పాస్ చేస్తున్నారా?

డిడి : గతంలో బిల్లులు వచ్చిన వెంటనే తాము బిల్లులు పాస్ చేసి బ్యాంకులకు పంపిన రోజునే చెల్లింపులు జరిగిపోయేవి. ఇప్పుడు అంతా ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చిన తరువాత ఆన్‌లైన్‌లో బిల్లులు సబ్‌మిట్ చేసిన తరువాత తాము ఆడిట్ చేసిన అనంతరం ఆటోమెటిక్‌గా సిఎఫ్ఎంఎస్ లాగిన్ ఫైనాన్స్ పోర్టల్‌లోకి వెళ్లిపోతాయి. టైం షెడ్యూల్ ప్రకారం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా నేరుగా బిల్లులు చెల్లించేస్తారు. గతంలో మా బిల్లులు రాలేదు. ఎప్పుడొస్తాయి అనే ఫిర్యాదులు వచ్చేవి. ఇప్పుడు అలాంటి సమస్యలు లేవు. 95 శాతం పూర్తిగా ఏ సమస్య లేకుండా చెల్లింపులు జరుగుతాయి. 5 శాతం బిల్లులు మాత్రమే ఏవైనా సమస్యలు తలెత్తి ఆగుతాయి. వాటిని సంబంధిత శాఖకు వెనక్కి పంపి పక్కాగా బిల్లులు పెట్టించిన తరువాత పాస్ చేసి చెల్లింపులు జరుపుతున్నాం.

ప్రశ్న : జిల్లాలో ఎంత మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు ? బద్వాడా ఎంత ?

డిడి : జిల్లాలో అనంతపురం ఖజానా శాఖ ప్రధాన కార్యాలయంతో పాటు 10 సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. మొత్తం 11 కార్యాలయాల ద్వారా సేవలు అందుతున్నాయి. జిల్లాలో 35 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. జిల్లా ట్రెజరీ ద్వారా వారికి ప్రతి నెల వేతనాలు, ఇతర బెనిఫిట్స్ బిల్లుల చెల్లింపులు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 16750 పెన్షనర్లకు నెలసరి బట్వాడా జరుగుతుంది. వీటిలో 10600 పెన్షన్లు అనంతపురం సబ్‌ట్రెజరీ ద్వారా బట్వాడా జరుగుతోంది. మిగతా 9 సబ్ ట్రెజరీలకు కలిపి 6150 పెన్షన్‌లు సబ్ ట్రెజరీలో ద్వారా పెన్షన్ బట్వాడా జరుగుతాయి. బిల్లులు పార్వర్డ్ చెల్లింపులు జరిగే సందర్భంలో చిన్న చిన్న సమస్యలు తెలెత్తినా డైరెక్టరేట్ డిజికి సంప్రదించి ఎక్కడ సమస్య ఉంటే తక్షణమే వారికి ఫార్వర్డ్ చేసి సమస్య పరిష్కారిస్తాం. జిల్లా ట్రెజరీలో అడ్మినిస్టేషన్‌తో పాటు శాలరీల పాసింగ్ ఉంటుంది. పెన్షన్‌లన్నీ జిల్లా ట్రెజరీ నుంచి సబ్ ట్రెజరీకి పార్వర్డ్ చేస్తారు. లోకల్ ఫండింగ్, ఏజీ కార్యాలయాల బిల్లులు ఆన్‌లైన్‌తో పాటు ఫిజికల్ కాపీలు వస్తాయి. డిడిఒ నుంచి ఆయా సబ్‌ట్రెజరీలకు వెళతాయి. వారు శాన్షన్ చేస్తారు. లోకల్ ఫండింగ్, ఏజీ కార్యాలయాల నుంచి బిల్లులు కొన్ని ఆన్‌లైన్‌తో పాటు ఫిజికల్ కాపీలు కూడా వస్తుంటాయి. ఫిజికల్ కాపీలు ఫీడ్ చేసిన తరువాత ఏజీ కార్యాలయాలనికి పంపిస్తాం. ఆటోమెటింగ్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా బిల్లులు చెల్లింపులు చేస్తారు. మార్చి తరువాత పూర్తిగా పేపర్‌లెస్ ఆన్‌లైన్ వ్యవస్థ రాబోతోంది. పేమెంట్‌లన్నీ ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయి.

ప్రశ్న :లావాదేవీలు ఎంత వరకు జరుగుతున్నాయి?


డిడి : 010 పద్దు కింద పని చేసే ఉద్యోగుల లావాదేవీలన్నీ ట్రెజరీ ద్వారానే జరుగుతాయి. ట్రెజరీకి సంబంధించి జరిగే లావాదేవీలన్నీ ఒక ఖాతా ద్వారా జరుగుతాయి. ట్రెజరీ ద్వారా రిసిప్ట్ ఎంత వచ్చింది, పేమెంట్ ఎంత వచ్చిందో కలిపి అకౌంట్ చేసి ఏజీకి ప్రతి నెల పంపిస్తాం. నవంబర్ నెలలో పెన్షన్లు రూ.86,34,44,144లు ట్రెజరీ ద్వారా జరిగితే మొత్తం రూ.355 కోట్లు పేమెంట్లు జరిగాయి. రూ.132 కోట్లకు మాత్రమే ప్రభుత్వానికి రిసిప్ట్ వచ్చింది. రూ.219 కోట్లు మైనస్ ఉంది. ఆయా జిల్లాల ఆదాయాన్ని బట్టి రిసిప్ట్ జరుగుతుంది. మిగతావన్నీ ఆర్‌బిఐ పరిధిలో నడుస్తాయి. లోటును ప్రభుత్వమే పూడ్చుతుంది. సెంట్రలైజేషన్ అయిపోయాక ఫైనాన్స్ పోర్టల్ ద్వారా టైం పిరియడ్ ప్రకారం చెల్లింపులు చేస్తారు.

ప్రశ్న : పెన్షన్లు ఎన్ని రకాలు ఎలా చెల్లిస్తారు?

డిడి : ఫ్యామిలీ పెన్షన్, ఎన్‌హ్యాన్స్ పెన్షన్ అని రెండు రకాల పెన్షన్లు ఉంటాయి. సర్వీస్ చేస్తూ మృతి చెందితే వారి ఫ్యామిలీకి వారి వయస్సు 67 వచ్చే వరకు ఎన్‌హ్యాన్స్ ఫ్యామిలి పెన్షన్ ఇస్తారు. 40 శాతం వరకు కమ్యూటేషన్ చేసుకోవచ్చు. ముందుగానే ప్రభుత్వానికి ఇంత డబ్బులు సరెండర్ చేస్తే దానికి వారికి వచ్చే పెన్షన్‌లో ప్రతి నెల కొంత అమౌంట్ తగ్గించి ముందుగానే ప్రభుత్వం అమౌంట్ సదరు ఉద్యోగికి చెల్లిస్తారు. దాన్ని కమ్యూకేషన్ అంటారు. ఉద్యోగి రెండు మూడు సార్లు కమ్యూకేషన్ చేసుకోవచ్చు.

ప్రశ్న : మీకార్యాలయంలో సిబ్బంది కొరత ఉందా?

డిడి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగ్గురు ఎటిఒలు ఉండేవారు. జిల్లా విభజన తరువాత ఇక్కడ అనంతపురం జిల్లాకు ఒక ఎటిఒ, పుట్టపర్తికి మరొక ఎటిఒ, కర్నూలుకు ఇంకో ఎటిఒ పోస్టును కేటాయించారు. జిల్లాలో బిల్లులు అధికంగా ఉంటాయి. ఎటిఒ 1900 బిల్లులు పాస్ చేయాల్సి వస్తోంది. తీవ్ర ఒత్తిడి పని భారం పడుతుంది. అందుకే ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాం. ఇంకో ఎటిఒను నియమించాలని కోరాము.


జిల్లా ఖజానాశాఖ అధికారి రమణయ్య

ప్రశ్న :బిల్లులు సకాలంలో చెల్లించడంలో జాప్యం జరుగుతోందా?

డిడి : ఆయా శాఖల డ్రాయింగ్ అధికారి సక్రమంగా బిల్లులన్నీ చేసి ఆన్‌లైన్‌లో పెడితే సకాలంలో బిల్లులు పాస్ అయిపోతాయి. డ్రాయింగ్ అధికారి ఒకటి రెండు సార్లు పరిశీలించి బిల్లులు పంపిస్తే ఎలాంటి జాప్యం జరగదు. సక్రమంగా బిల్లులు పాస్ చేసి ఎవరికి ఇబ్బంది లేకుండా చూడటమే మా లక్ష్యం. 6 నుంచి 10 వ తేదీ వరకు సప్లమెంటరీ బిల్లులు, అరియర్ బిల్లులు చేయడానికి ఆస్కారం ఉంటుంది. 19 నుంచి 25 వరకు శాలరీ బిల్లులు వస్తాయి. వాటిని 1వ తేదీన చెల్లింపులు చేసేలా పాస్ చేస్తాం. సప్లమెంటరీ, బడ్జెట్ బిల్లుల విషయంలో టై టేబుల్ ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. బిల్లులు సక్రమంగా జరగడమే ట్రెజరీ ఉద్యోగుల లక్ష్యం.

సెల్‌టవర్ నిర్మాణ పనులు అడ్డగింత

ప్రజాశక్తి-గుంతకల్లు



సెల్‌టవర్ నిర్మాణం చేస్తున్న ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు, సిపిఎం నాయకులు

పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉన్న రజకవీధిలో ఆదివారం ఓ ఇంటిపై ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సెల్ టవర్ నిర్మాణ పనులను చేస్తున్న ఇంటి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ మూడు నెలల నుంచి తిలక్‌నగర్ రజక వీధి ప్రాంతంలో నీలకంఠారెడ్డి తన ఇంటిపై నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణానికి ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేదన్నారు. అసలే రోడ్లు ఇరుకుగా ఉండగా ఎప్పుడైనా అగ్ని ప్రమాదం జరిగితే నివారణ చర్యలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. రజక వృత్తి చేసుకుంటూ జీవనం చేస్తున్న వారికి అనారోగ్య సమస్యలు రాకుండా వెంటనే టవర్‌ను పూర్తిగా తొలగించాలన్నారు. ఇంటి యజమాని తన స్వార్థం కోసం చుట్టుపక్కల ప్రజలు ఎంత వద్దన్నా నిర్మాణం పనులు చేపడుతున్నారని ఆరోపించారు. సెల్ టవర్‌ను తొలగించకపోతే 60 అడుగుల రోడ్డు పూర్తిగా దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు రంగమ్మ, సురేంద్రబాబు, కమిటీ సభ్యులు షబ్బీర్, విద్యార్థి సంఘం నాయకులు వైటిసి రమేష్, తిలక్‌నగర్ ప్రాంతవాసులు కృష్ణ, రాజేంద్ర, విరుపాక్ష, శివమ్మ, రాముడు, శ్రీనివాసులు, రజిని, జానకి, రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో అనంత బాలోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం జిల్లా కమిటీ సూచన మేరకు అనంత బాలోత్సవం కార్యక్రమాన్ని రాయదుర్గంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ తరపున పరిశీలకులుగా వి.గోవిందరాజులు హాజరై మాట్లాడుతూ అనంత బాలోత్సవాన్ని గత ఆరేళ్లుగా అనంతపురంలో మూడు రోజుల పాటు నిర్వహించినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో ఈసారి రాయదుర్గలో నిర్వహిస్తే ఈ ప్రాంతంలోని విద్యార్థులు ఎక్కువ శాతం పాల్గొనే విధంగా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పిల్లల్లో మానవతా విలువలను పెంచడం, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడం, ప్రస్తుత సమాజంలో మానవతా విలువలు కలిగిన విద్యార్థులను తయారు చేసి, భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే అనంత బాలోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం బాలోత్సవం రాయదుర్గం అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా జి.సత్యనారాయణ, అధ్యక్షులుగా ఎన్.హనుమంతురెడ్డి, సహాధ్యక్షులుగా బి.మల్లికార్జున, కార్యదర్శిగా బి.శివానంద, సహాయ కార్యదర్శిగా కె.నాగరాజు, కోశాధికారిగా బి.శివ, సభ్యులుగా సి.జగదీష్, రవికుమార్, బి.నాగరాజు, మురళీ, బి.వలి, కె.జస్వంత్, రోశయ్యను నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, సిఐటియు, జెవివి, నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నియాజ్

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం



ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్ అసెంబ్లీలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. వైసిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నియాజ్ ఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈమేరకు అనంతపురంలోని క్యాన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియాజ్‌తోపాటు వైసిపి కార్యకర్తలకు టిడిపి జిల్లా అధ్యక్షులు పూల ప్రసాద్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పార్టీ కండువాలను కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి చూసి పలువరు వైసిపి నాయకులు, కార్యకర్తలు పార్టీలోకి వస్తున్నారన్నారు. ఇందులో భాగంగా వైసిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నియాజ్‌తో వేలాది మంది ముస్లింలు, వైసీపీ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నరసింహులు, తదితరులు టిడిపిలో చేరారన్నారు. వారి రాకతో టిడిపిలో ఉత్సాహం మరింత రెట్టింపు అయిందన్నారు. అంతకుముందు నగరంలోని సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, కోర్టు రోడ్డు, రామ్‌నగర్ మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

'విద్యుత్ ఛార్జీల తగ్గింపు చంద్రబాబు ఘనతే'

ప్రజాశక్తి-పుట్లూరు

దేశంలోనే విద్యుత్ ఛార్జీలను తొలిసారిగా తగ్గించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. పేదలపూ విద్యుత్ ఛార్జీల భారం పడకుండా ఉండేందుకు చంద్రబాబు సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సుపరిపాలన అందిస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల వల్ల సంక్షభంలోకి వెళ్లిన విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టిన ఘనత సిఎం చంద్రబాబుదే అని చెప్పుకొచ్చారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు అధిక విద్యుత్ బిల్లులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ముఖ్యంగా రైతులు, విద్యుత్ వినియోగదారులు, ఆక్వా రైతులు, గృహ వినియోగదారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. విద్యుత్ రంగాన్ని దివాలా దిశగా నడిపించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ సంస్కరణలు చేపట్టి సాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఇలాగే ముందుకు సాగితే రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను దృఢంగా అభివృద్ధి చేస్తామని నిపుణులే చెబుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు తగ్గించి హామీని నిలబెట్టుకున్నారన్నారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి

గ్రామీణ వైద్య సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మస్తానయ్య

ప్రజాశక్తి-పామిడి

రాష్ట్రంలోని గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని గ్రామీణ వైద్యుల సంక్షమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మస్తానయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో క్లినిక్‌లో విలేకరులతో మాట్లాడుతూ 2009లో అప్పటి ప్రభుత్వం జీవో నెంబర్ 429 తెచ్చిందని అయినా వాటి అమలు, గ్రామీణ వైద్యులకు పూర్తి గుర్తింపు, ఇతర నిబంధనలపై జీవో జారీ చేయాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉందన్నారు. గ్రామీణ వైద్యులకు తెలంగాణ ప్రభుత్వం శనివారం రోజు తెలంగాణ అసెంబ్లీ సాక్షగా గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపు ఇవ్వాలని తీర్మానం చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వంతోపాటు ఆ రాష్ట్ర గ్రామీణ వైద్య సంఘానికి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కూడా గ్రామీణ వైద్య సంఘాల జెఎసి కూడా గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈమేరకు గ్రామీణ వైద్య సంఘాల జేఏసీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందన్నారు. త్వరలోనే చర్చలు ఫలించి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందివ్వాలని, ఇతరత్రా సహాయ సహకారాలు అందించాలని కోరనున్నట్లు తెలిపారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రాయదుర్గం



మెగా చెక్కును అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

మహిళా సాధికారతకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతోపాటు సిఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలుగు ఆధ్వర్యంలో 'మా డబ్బులు - మా లెక్కలు' ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు రూ.1.52 కోట్ల మెగా చెకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సొంత అభిప్రాయాలు, తెలివితేటలు, అవకాశాలు ఉంటాయన్నారు. మహిళామణులను స్వయం సమృద్ధి దిశగా నడిపించాలన్న ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. తర్వాతనే మహిళల్లో ఆర్థిక విప్లమానికి నాంది పలికినట్టు అయిందన్నారు. ముఖ్యంగా రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ఎస్‌హెచ్‌జిలకు ఏడాదిలో సుమారు రూ.200 కోట్ల ఆర్థికసాయం అందిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటే కుటుంబ ఆర్థిక పరిస్థితికి దోహదపడుతున్నారు. పురుషుల కంటే ఎక్కువ ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, కౌన్సిలర్లు జ్యోతి, ప్రశాంతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ రంగంలో మహిళల పాత్ర కీలకం

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గంరూరల్



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

మహిళలు రాయదుర్గం గార్మెంట్స్ రంగానికి అవసరమైన శక్తిగా ఎదగాలని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాయదుర్గంలోని కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని విప్ పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 2014లో తాను తొలిసారి రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందినప్పుడు టాటా ట్రస్టుతో పాటు మరికొందరి సహకారంతో ఈ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కొంతకాలం నడిచినా తర్వాత వివిధ కారణాల వల్ల మూతబడిందన్నారు. 2024లో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తిరిగి అధికారం చేపట్టాక పున:ప్రారంభానికి నోచుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం గార్మెంట్స్ పరిశ్రమంలో కార్మికుల కొరత చాలా ఎక్కువగా ఉందన్నారు. ఇక్కడ తగిన తర్ఫీదు పొంది మంచి టైలర్‌గా మారితే రాయదుర్గం వస్త్ర పరిశ్రమకు మీ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఒకరకంగా చెప్పాలంటే పరిశ్రమకు మహిళలే ఓ శక్తిగా తయారవుతారన్నారు. తమ గ్రామాలు, కుటుంబాల్లో తమకున్న పరిస్థితులు ఎలా ఉన్నా ఇక్కడ శ్రద్ధగా శిక్షణ పొందితే జీవితంలో మహిళలకు ఒక భరోసా లభిస్తుందన్నారు. కలెక్టర్‌ను ఇక్కడికి పిలిపించి ఇదంతా చూపించి శిక్షణ కోసం డబ్బులు కూడా మంజూరు చేయించామన్నారు. దాంతో మళ్లీ నేడు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించుకుంటున్నట్లు వివరించారు. ఒక బ్యాచ్‌కి వందమంది చొప్పున శిక్షణ పొందే అవకాశం ఉంటుందన్నారు. జూకి మిషన్లపై శిక్షణ నాణ్యతతో పాటు వేగంగా ఉండటంతో ఉత్పత్తి కూడా ఎక్కువ చేసే అవకాశం ఉందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు అధికారి గంగాధర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, మున్సిపల్ వార్డు సభ్యులు బళ్లారి జ్యోతి, కురుబ ప్రశాంతి, పార్టీ నేతలు టంకసాల హనుమంతు, బండి భారతి, తిప్పేస్వామి, యల్లప్ప, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

నూతన జెడిఎ, విద్యుత్ శాఖ ఎస్ఇలతో ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-అనంతపురం



ఎమ్మెల్యే సునీతకు బొకే అందజేస్తున్న జెడిఎ రవి

రైతు సమస్యల పరిష్కారమే మీ తొలి ప్రాధాన్యత కావాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతపురం జెడిఎ ఎం.రవి, సత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ మోసెస్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఈమేరకు ఎం.రవి, ఎస్ఇ ఆదివారం రామగిరి మండలం వెంటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని వ్యవసాయ పరిస్థితులు, సత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న మూడు మండలాల్లో విద్యుత్ సమస్యలపై చర్చించారు. ప్రధానంగా వ్యవసాయ పరంగా రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. పంటల విషయంలో ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చే విధంగా చొరవ చూపాలన్నారు. రైతులంతా ఒకే రకం పంటలు వేయకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలని జెడిఎ రవికి సూచించారు. మరోవైపు రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్ఇ మోసెస్‌కు చెప్పారు. పెండింగ్ లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, విద్యుత్ సరఫరా విషయంలో జరుగుతున్న అంతరాయం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. తర్వాత నూతనంగా నియమితులైన ఆశావర్కర్లకు నియామక పత్రాలు అందజేశారు.

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

అనంతపురం : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ మొబైల్ నెంబరు..89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల వ్యాపారం ప్రారంభం

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంఘ త్రిసభ్య కమిటీ సభ్యులు, సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఎరువుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ డైరెక్టర్ ఆకుల లోకనాథ్ మాట్లాడుతూ సంఘం కంప్యూటరీకరణ జరిగిందని, ఎలాంటి అవినీతి లేకుండా కార్యకలాపాలు కొనసాగుతాయని వివరించారు. డైరెక్టర్ సాకే ఓబులప్ప మాట్లాడుతూ సంఘం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా శ్రేయస్సు కోసమే పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చీమల నరసింహుడు, రైతులు, సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి హరి రామేశ్వర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మాల మహాసభ జిల్లా కార్యదర్శిగా టి.సురేష్



గుత్తి : మాల మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుత్తికి చెందిన తక్కల సురేష్ ఎన్నికయ్యారు. ఇటీవల గుంటూరులో జరిగిన మాల మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు మల్లెల వెంకటరావు ఆదేశాల మేరకు సురేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గుత్తిలో జరిగిన కార్యక్రమంలో టి.సురేష్ మాట్లాడుతూ జిల్లాలోని మాల సామాజిక వర్గం అభివద్ధి, సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు. సంఘం బలోపేతానికి అహర్నిశలు పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహాసభ జిల్లా అధ్యక్షులు చిన్న నాగప్ప,రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.చిన్న వెంకటేశులు,డి.అగ్గి రాముడు,నాయకులు మన్నల రామాంజనేయులు, నగరూరు విజయ్ కుమార్, ఓబయ్య, బాలన్న, మునిస్వామి, చంద్రమోహన్, ప్రసాద్, న్యాయవాది సాలప్ప, డ్రైవర్ కష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి



కార్యకర్తలకు మెమొంటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్వగృహంలో ప్రతిభ కనబరిచిన పార్టీ కార్యకర్తలకు మెమొంటోలను బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కార్యకర్తలు బాగా పని చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి కార్యకర్త కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు, మనం చేస్తున్న అభివృద్ధి పనులను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

నూతన బస్సుసర్వీసు ప్రారంభం

గుత్తి : మండలంలోని సేవాఘడ్ నుంచి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వరకూ ఏర్పాటు చేసిన నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఆదివారం ప్రారంభించారు. ముందుగా సేవాఘడ్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 13, 14, 15వతేదీల్లో జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలతో పాటుగా అనేక విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ గుత్తి డిపో సూపరింటెండెంట్ కృష్ణానాయక్, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్ అధ్యక్షులు కొర్ర జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవనాయక్, ట్రస్ట్ ధర్మకర్త మహారాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీఎల్.రవీందర్‌నాయక్, జనరల్ సెక్రటరీ అశ్వర్థనాయక్, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ చక్రీనాయక్, ట్రస్టు కోశాధికారి బాలానాయక్, సభ్యులు ఠాగూర్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

విశాఖ మహా ప్రదర్శనలో పామిడి సిఐటియు నాయకులు



ర్యాలీలో పాల్గొన్న పామిడి సిఐటియు నాయకులు

పామిడి : జాతీయ మహాసభల్లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన కార్మిక మహా ప్రదర్శనలో పామిడి సిఐటియు సీనియర్ నాయకులు గజనాంపల్లి మల్లేష్, సాయికుమార్,శివ కుమార్, షాషు, సాలమ్మ, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామిడిలో ఎన్నో ఆటంకాలు అధిగమించి సంఘం విస్తరణ, సంఘటితం లక్ష్యంగా అలుపెరగని స్థాయిలో పని చేశామన్నారు. ముఖ్యంగా కేంద్రంలోని కార్పొరేట్ బిజెపి ప్రభుత్వం, రాష్ట్రాల్లోని బిజెపి పాలిత, కార్మిక వ్యతిరేక ప్రభుత్వాల నిర్బంధాలు, సష్టించిన ఇబ్బందులను వీరోచితంగా దేశంలోని సిఐటియు నాయకులు ఎదుర్కొన్నారని వివరించారు.

నేడు గ్రామసభలు

పుట్లూరు : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చి వికసిత్ భారత్ రోజ్‌గార్, అజివిక మిషన్ గ్రామీణగా నిర్ణయించినందున ప్రజలు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు సోమవారం మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ అలివేలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించడమే 'హెబియస్ కార్పరస్ రిట్' లక్ష్యం

హైకోర్టు న్యాయవాది ఎస్.సుభాన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



సమాజంలో పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించడమే హెబియస్ కార్పస్ రిట్ ప్రధాన లక్ష్యమని హైకోర్ట్ న్యాయవాది ఎస్.సుభాన్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ హెబియస్ కార్పస్ రిట్ అనే వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించేందుకు ఉపయోగించే ఒక న్యాయపరమైన ఆదేశం అన్నారు. ఇది ఒక వ్యక్తిని చట్ట విరుద్ధంగా నిర్బంధించినప్పుడు, ఆ వ్యక్తిని కోర్టు ముందు హాజరుపరిచి, నిర్బంధం చట్టబద్ధమైందో.. కాదో.. విచారించాలని కోర్టు ఆదేశిస్తుందన్నారు. సుప్రీంకోర్టు (ఆర్టికల్ 32 ప్రకారం) హైకోర్టులు (ఆర్టికల్ 226 ప్రకారం) ఈ రిట్‌ను జారీ చేయనున్నట్లు వివరించారు. హెబియస్ అంటే లాటిన్‌లో మీరు శరీరాన్ని కలిగి ఉండాలని అర్థం అన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడటం, చట్టబద్ధమైన కారణం లేకుండా ఎవరినీ నిర్బంధించకూడదన్నారు. ఎవరినైనా అరెస్ట్ చేసి 24 గంటల్లోపు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోతే చట్టాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్ట్స్ కళాశాల

ప్రజాశక్తి-అనంతపురం



క్రీడాకారులకు బొకే అందజేస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్

శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయ అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీల్లో భాగంగా రెండవరోజు ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో ఓవరాల ఛాంపియన్‌గా ఆర్ట్స్ కళాశాల నిలిచింది. పురుషుల విభాగం 200 మీటర్ల పరుగు పందెంలో జి.మధ నారాయణ ఫిజికల్ ఎడ్యుకేషన్ తాడిపత్రి, సి.మహేష్‌బాబు ఆర్ట్స్ కళాశాల, ఎం.పవన్‌కుమార్ ఆర్ట్స్ కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అలాగే 1500 మీటర్ల పరుగు పందెంలో బి.గురు రవితేజ పివికెకె, యోగేంద్ర, బి.పురుషోత్తం ఆర్ట్స్ కళాశాల ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు, 10వేల మీటర్ల పరుగులో సి.వంశీ, డి.రాజవర్ధన్ ఎస్ఎస్‌బిఎన్, సి.దిలీప్‌కుమార్ ఆర్ట్స్ కళాశాల ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు సాధించారు. వీటితోపాటు అనేక పోటీలు నిర్వహించారు. ఆయా విజేతలకు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ బి.జెసి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవులు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీరామ్, శత్రుఘ్న, నగేష్‌నాయక్, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు బహుమతులను ప్రదానం చేశారు.

వైసిపి గ్రామ కమిటీ ఏర్పాటు

బుక్కరాయసముద్రం : నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ ఆదేశాలతో వైసిపి మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంతరెడ్డి అధ్యక్షతన మండల పరిధిలోని పసలూరు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అబ్జర్వర్ పార్వతమ్మ, బయపరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, చిన్నపరెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కాశప్ప, భాస్కర్, నారాయణస్వామి, ముత్యాలరెడ్డి, కవిత, భీమయ్య, రవికుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి జిఎన్ఎం కోర్సుకు ఇంటర్వ్యూలు

అనంతపురం : వైద్య మరియు ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న జిల్లాలోని 17 పారామెడికల్ కళాశాలల్లో 2025-26కు సంబంధించి జిఎన్ఎం కోర్సుకు ఈనెల 6, 7వతేదీల్లో అడ్మిషన్ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డిఎంహెచ్ఓ డాక్టర్ ఇబి.దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 761మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కన్వీనర్ కోటా కింద ఉన్న 594 సీట్లను మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ భవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫ్యాక్షన్ గ్రామంలో సోదాలు

పెద్దవడుగూరు : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన చిన్నవడుగూరులో పోలీసులు ఆదివారం సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఐ ఆంజనేయులుతోపాటు సిబ్బంది కలిసి అనుమానితుల ఇళ్లతోపాటు రౌడీషీటర్ల గడ్డివామి ప్రాంతాల్లో సోదాలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేయాలని చెప్పారు.

ఎపి ఎన్‌జిఒ జిల్లా కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్ : ఎపి ఎన్‌జిఒ జిల్లా కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్ రెండోసారి ఎన్నికయ్యారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పని చేస్తున్న ప్రవీణ్ కుమార్ ఎన్జీవో కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివి రమణ సహకారంతో తాను రెండోసారి ఎన్నికైనట్లు తెలిపారు. జిల్లాలోని అన్నిశాఖల ఉద్యోగులు, మహిళా ఉద్యోగుల సమస్యలపై పోరాడతానని తెలిపారు.

సూర్య సేవాసమితి నూతన కమిటీ ఏర్పాటు

రాయదుర్గం : సూర్య సేవాసమితి నూతన కార్యవర్గం ఆదివారం రాయదుర్గంలో ఏర్పాటైంది. అధ్యక్షులుగా పసుపులేటి వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఉబేదుల్లా, ప్రధాన కార్యదర్శిగా బిసా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా కొంగితి సత్యనారాయణ, కోశాధికారిగా బిఎన్.ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ మృతి

గుత్తి : పట్టణానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ బొగ్గ నాగభూషణం శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆదివారం విషయం తెలుసుకున్న శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు ఆయన నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్డీటీ కబడ్డీ సెంట్రల్ లీగ్‌కు ఎంపికైన 'విజన్'

యాడికి : ఆర్డీటీ, వివేకానంద కబడ్డీ క్లబ్ సంయుక్తంగా ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మండల కేంద్రంలోని విజన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల జట్టు ఎంపికైంది. ఇందులో భాగంగా డిఎస్ఎ అనంతపురం జట్టు, కురుకుంట్ల జడ్‌పిహెచ్ఎస్, ఆర్డీటీ జట్లపై యాడికికి చెందిన విజన్ ఇంగ్లీష్ మీడియం జట్టు వరుసగా మూడు విజయాలు సాధించి సెంట్రల్ లీగ్‌కి ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్ ప్రసాద్, విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యా సంస్థల అధినేత విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించారు.

నలంద పూర్వ విద్యార్థికి సన్మానం



పూర్వ విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం : నలంద జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, అష్టావధాని, ప్రవచనకర్త, అఖండ-2 సినీ గేయ రచయిత బ్రహ్మశ్రీ మాడుగుల నాగగురునాథ్ శర్మను ఆదివారం అనంతపురంలోని నలంద జూనియర్ కళాశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఖాజీబాబు మాట్లాడుతూ భారతదేశంలోని హైందవ ధర్మం, దేశం గొప్పదనాన్ని నలంద జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి నాగ గురునాథ్ శర్మ అఖండ-2లో అద్భుతమైన గేయాన్ని రచించడమే గాకుండా విద్యార్థుల కు సమాజంలోని విలువలు నేర్పారన్నారు.

నేరాలు ఘోరాలు

ఇసుక దిబ్బల కింద పడి 30 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

శింగనమల : ఇసుక దిబ్బల కింద పడి దాదాపు 30 గొర్రెలు మృతిచెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని సలకంచెరువు గ్రామం సమీపంలోని వంక పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ఇరువెందుల గ్రామానికి చెందిన తలారి రామకృష్ణరాజు గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే గొర్రెలను మేపుకునేందుకు జలాలపురం గ్రామం సమీపంలోని వంక సమీపంలోకి తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో వంకలో నీరు తాగేందుకు వెళ్లిన గొర్రెలు నీరు తాగుతుండగా ఒక్కసారిగా ఇసుక గడ్డలు ఒరిగాయి. దీంతో ఇసుక దిబ్బల కింద పడి దాదాపు 30 జీవాలు మృతిచెందాయి. దీంతో కాపరి లబోదిబో మన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కాపరి వేడుకున్నాడు.

ఘర్షణ కేసులో నిందితుల అరెస్టు

యల్లనూరు : యల్లనూరులో జనవరి 1వతేదీన జరిగిన వైసిపి, టిడిపి ఘర్షణలో నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. యల్లనూరుకు చెందిన నిందితులు దాసరి శివ, దాసరి రాము, దాసరి మారుతీకుమార్, చేపల పెద్దన్న, దాసరి పెద్దిరాజు, దాసరి శివ, దాసరి నరేష్, బొగ్గు చరణ్, చాపల సురేష్, చాపల రాము, జంగంపల్లి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరోవర్గం వారు పరారీలో ఉన్నారని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.